# హళ్ళికి హళ్ళి

- శంకరమంచి పార్థసారథి

## ఇందులోని పాత్రలు

1. సువర్చల
2. చక్రపాణి
3. చలపతి
4. రాజయ్య

# హళ్లికి హళ్లి

- శంకరమంచి పార్థసారథి

( తెరతీసే సరికి – అదొక మధ్య తరగతి ఇంట్లో డ్రాయింగ్ రూమ్ – వాతారణం సాధారణంగా వుంది. ఇంటి యజమాని చలపతి విసుగ్గా లోనికొచ్చేడు...చెప్పులు విడిచి లోనికి వెళ్ళబోయి.... వినిపిస్తున్న భార్య మాటల్ని ఆలకిస్తున్నాడు )

సువ : వెనక్కి ....యింకాస్త వెనక్కి ....ఆ ...అట్లా..యిం కొంచెం...

( చలపతి అనాలోచితంగా లోపలినుంచి వినిపిస్తున్న మాటలకనుగుణంగా వెనక్కి జరుగుతూ వచ్చి అప్పుడే లోనికొచ్చిన చక్రపాణిని ఢీ కొట్టాడు... చక్రపాణి విష్ చేసి )

చక్ర : గుడ్ మార్నింగ్ సార్ ....ఐయామ్ చక్రపాణి...పేరుకు తగ్గట్టు చేతిలో చక్రాలయితే లేవు గానీ ....స్కీములు మాత్రం పుష్కలంగా వున్నాయండి యింతకి అమ్మగారి పేరు?

చల : కన్నతల్లి పేరు కనకమ్మ ...సవిత్తల్లి పేరు, సావిత్రమ్మ ....వీళ్ళు కాక వుంచుకున్నావిడ పేరు ఉమాదేవి... ఏ పేరు కావాలో అది రాసుకో...

చక్ర : నాన్నగారికి వోపిక వుత్సాహం బాగా ఎక్కువనుకుంటాను....అదలా వుంచండి... అయినా నేనడిగింది... మీ వైఫ్‌గారి పేరు.

చల : సువర్చల ...అయినా  దాని పేరుతో నీకేం పని ? ...

చక్ర : చెప్తానండి...ఇంతకీ మనకి ఒక్కర్తే వైఫా ? లేక నాన్నగార్లాగా ?....

చల : మనకేవిటి ? ...మనకి...వెధవ బహు వచనం...నువ్వూను ...నేను ఒకేసారి తప్పు చేసాను... యిక చస్తే చేయను... అంచేత ఏకపత్నీ వ్రతుణ్ణి గానే వుండిపోయా ..... ఒక్క దానితోనే వేగ లేక చస్తున్నా..... దీని పిచ్చి పాడుగాను....దీంతో గుండె జబ్బు వచ్చేటట్టుంది...

చల : అవునూ... యింతకీ పేర్లూ గోత్రాలు అడుగుతున్నావ్....ఏమిటి సంగతి... జనాభా లెక్కలా ?....

చక్ర : లేదండీ...నా లైను వేరు....ఒక్కసారి అమ్మగార్ని పిలిస్తే అన్ని వివరాలూ గడగడా చెప్పేసి పక్కింటికెళతానండి....

చల : వివరాలా ?...ఏ వివరాలు ? ....దేని గురించి ?....

చక్ర : అదే చెపుతుంటే తవరు అడ్డు తగులుతున్నారు.... యిప్పుడు మార్కెట్లో రకరకాల స్కీమ్‌లు వచ్చి వాల్తున్నాయండి...తేలిక వాయిదాల్లో మీకు తాజ్‌మహల్ కావాలన్నా అరేంజి చెయ్యగలనండి...అదీ పరిస్థితి...కానీ యీవిషయం యింట్లో వుండే ఆడవాళ్ళకేం తెలుస్తుంది చెప్పండి ?....

చల : ఓహో....అంచేత ఆ షాపుల వాళ్ళంతా నిన్ను డెవలప్‌మెంట్ ఆఫీసర్లా అపాయింట్ చేసుకున్నారన్నమాట.

చక్ర : ఎక్జాట్లీ...ప్రతి యింటికీ వెళ్ళి స్కీములు వివరాలు ప్రతి యిల్లాలికి చెప్పి వాళ్ళని ఎంకరేజ్ చెయ్యడం నా డ్యూటీ అండి... యిహనైనా సువర్చల గార్ని పిలుస్తారా ?...

చల : పిలవను...చస్తే పిలవను...అదిగాని ఈ స్కీముల గురించి విన్నదో ఇహ బరి తెగించి...బజార్నపడి...వస్తువులేకాదు...విమానాలూ...హెలికాఫ్టర్లు కూడా కొనేయొచ్చు...

చక్ర : అలాగా....అంత ప్రోగ్రసివ్ లేడీ అన్నమాట... వుండాలండి...ఆడవాళ్ళకి ఆమాత్రం వుత్సాహం, ఉద్రేకం వుండాలి.... అయితే " పే టెన్ టేక్ ఒన్ స్కీమ్‌గానీ వింటే ఆ మహ యిల్లాలు సంతోషపడి పోతుందో కదా ! పది పైసలు కట్టండి...పట్టు చీర పట్టుకుపోండి....

చల : పది పైసలకి పట్టుచీరా ?.....అమ్మో నాకొద్దు....

చక్ర : పదిపైసలకి పట్టు చీర ...నాకొద్దంటున్నారా ? ....ఆ సుబ్బారావుగారూ యిదే అన్నారు...అయినా మీక్కాదు...అక్కయ్యగార్కి ...వస్త్రాలతలో అరవై ఆరో షాపు...స్కీము నిన్ననే ప్రారంభించేడు.... పట్టు చీర తీసుకొని యివాళ పదిపైసలు, రేపు ఇరవై పైసలు, ఎల్లుండి ముప్పై యిలా పెంచుకుంటూ కట్టుకుంటూ పోవాలి.... ఇహపోతే .... చివరిమజిలీ నర్సింగ్ హోంవాళ్ళిలా తెలియజేస్తున్నారు...

చల : చివరిమజిలి నర్సింగ్ హోమేమిటి నీ బొంద....

చక్ర : బహుశా... నర్సింహోం పేరువిని వర్రీ అయిపోతున్నట్టున్నారు....ట్రీట్‌మెంట్ గ్యారంటీ....కాకపోతే డాక్టరుగారు వైద్యంలో కన్నా నవలలూ అవీ బాగా రాసి సంపాయించేరు.... అంచేత పొయిటిగ్గా, ఫిలాసాఫికల్‌గా ఆపేరు పెట్టారు.... అక్కడ బాడీ కంప్లైంట్‌గా చెకప్ చేయించుకుంటే స్టీల్ కంచం ఫ్రీ.... చిన్నాపరేషన్‌కి స్టీలు బిందె...పెద్దాపరేషన్‌కి ప్రెషర్ కుక్కర్ ఫ్రీ....

చల : వాడిచేతుల్లో హరీమంటేనో....

చక్రి : ఏవిటీ ...కాలం చేస్తేనంటారా ? ...డాక్టర్‌గారు హ్యూమనిటేరియన్ కన్సిడరేషన్ వున్న మనిషి.... అక్కడ ప్రాణం పోతే గులాప్పూల దండవేసి మారుతీ కార్లో యింటికి పంపిస్తారు.... నెక్స్ట్ నవల మీకు అంకితం యిస్తారు.... యిహపోతే...

చల : హమ్మో ...నే విన్ను ...వీళ్ళ స్కీములు తగలెయ్య...డాక్టర్లు లాయర్లు కూడా యిలా స్కీములు పెడితే యిం కేవన్నా వుందా ?

( అంటూ చటుక్కున చక్రపాణి చెవుల్లోని పత్తిని తీసి తన చెవుల్లో పెట్టుకున్నాడు...చక్రపాణి ఏదో చెప్పాలని మైమ్‌లో ప్రయత్నిస్తున్నాడు.... కానీ చలపతి వినే ధోరణిలో లేడు )

చల : వెళ్ళిపో..... మళ్ళీ ఈ గడప తొక్కొద్దు... నీ కాళ్ళు పట్టుకుంటా.... కావాలంటే ప్రతి ఫస్టుకీ గూర్ఖా వాడికిచ్చినట్లు అయిదో పదో యిచ్చుకుంటా.... నా పెళ్ళానికి మాత్రం వీటిని గురించి చెప్పకు ప్లీజ్ .... వెళ్ళిపో....

( చక్రపాణి చలపతి చెవుల్లోని పత్తిని తీసకుని )

చక్ర : నా పత్తి నాకిప్పించండి...పక్కింట్లో దాంతో పనుంటుంది... అయినా మీరుండగా రావడం నా బుద్ధి తక్కువ.

( చలపతి చక్రపాణిని బలవంతంగా బయటకు తోసి వెనక్కి తిరిగి చూడగా రాజయ్య లోపల్నుంచి వస్తూ కనిపించేడు )

చల : ఏరా రాజయ్యా.... మళ్ళీ యివాళేం తీసుకొచ్చి తగలడ్డావ్...

రాజ : బీరువాండి.... బాబూ అమ్మగారియ్యాల నన్ను భలే మెచ్చుకున్నారండి.... " ఒరే రాజయ్యా...ఎయ్యి రూపాయలెట్టి బీరువా కొనడం కాదురా.... దాన్ని జాగర్తగా రిచ్చా బండీలో తీసుకురావడం గొప్పా " అని ...అదేంటి బాబూ ఏడుపు మొహం పెట్టేశారు.

చల : నీపెళ్ళాం కూడా బరితెగించి వీధినపడి కంటపబడ్డ ప్రతి వస్తువుని ఇన్‌స్టాల్‌మెంట్‌లో కొనేస్తే నీక్కూడా మొహం యిలాగే పెట్టాలనిపిస్తుంది రా.... వెయ్యి రూపాయలే

రాజ : యింకాపైనే వుండొచ్చండి...అయినా ఏం లాబంలేండి..రిచ్చావోడికి ఓ రూపాయెక్కువ ఇమ్మంటే చాలు మొహం ముడచుకుపోద్ది....అమ్మగారు బీరువా చూసి మురిసిపోతున్నట్టున్నారు ...కిరాయిప్పించండి...నే పోతా....

( సువర్చల లోపలినుండి వస్తూ )

సువ : ఇదిగో అబ్బీ...ఓ రూపాయి తక్కువుంది గానీ తరువాతొచ్చి తీసుకో... ( అంటూ చలపతిని చూసి ) వచ్చేరా ... ఓ రూపాయుంటే ఇవ్వండి...

చల : ఏవిటే ... మళ్ళీ ఇన్‌స్టాల్‌మెంట్లో బీరువా కొన్నావా ?

సువ : మళ్ళీ ఏవిటి ? ....ఎవరన్నా వింటే రెండో సారి కొన్నాననుకుంటారు.... ఒక్కసారి కొన్న వస్తువు చస్తే మళ్ళీ కొనను...

చల : ఎంతయింది ? .... వెయ్యిరూపాయలా ?...

సువ : కంపెనీ మంచిదికదా...పదిహేనొందలు...అలా నోరు తెరవకండి....పది వాయిదాలు... ఏవండీ... కలరూ అదీ ఎంత బావుందనుకున్నారూ.... లాకరు కూడా వుందండి...బుజ్జి ముండ భలే ముద్దొస్తుంది.... రండి చూద్దురుగానీ...

రాజ : అవతల నాకు గిరాకీలొచ్చే వేళయింది... నా కిరాయి నాకిప్పిస్తే....

సువ : ఓ రూపాయుంటే యివ్వండి...ముందు వాణ్ణి పంపేద్దాం....

చల : ఆ బట్టల కొట్లో పాంటింగ్ షర్టింగ్ నాలుగు జతలు పుచ్చుకున్నావటగా...వాడెవడో వచ్చేడు... దిక్కుమాలిన డబ్బా కెమేరా వాడూను....

సువ : వాడా... సైదులని ....అలా వెళుతుంటే పిలిచి .,..అమ్మగారూ... మీ చెయ్యి మంచిది... కొత్త స్కీం పెట్టాం... బోణీ చెయ్యమంటే నూ... సరే మీరెలాగూ బట్టల్లేవని గొణుక్కుంటున్నారు గదాని పక్క షాపులో నెలకోవంద చొప్పున యిస్తానని చెప్పి తెచ్చా....

చల : మంచి పన్చేసావ్.... ఇంతకీ నీ వుద్యమం పూర్తయినట్టేనా ? ...యింకా కొనాల్సినవి..

సువ : సర్లేండి....అంతంకాదిది ఆరంభం అని.... యింకా డైనింగ్ టేబిలూ, ఫ్రిజ్, కలర్ టి.వి, మిక్సీ

చల : వి.సి.ఆర్

సువ : అవునండోయ్...ఆ మాటే మార్చిపోయా....వీ.సీ.ఆర్...యింకా....

రాజ : అతుక్కుపోయిన మంచాలూ... రబ్బరు పరుపులూ....

సువ : ఆ...డబుల్‌కాట్స్...

చల : ఓ పన్జెయ్యవే... నన్నెవరన్నా వాయిదాల పద్ధతిలో కొంటారేమో అమ్మేసి నీక్కావాల్సిన సామాన్లన్నీ కొనుక్కో ...అప్పటికన్నా నీ తనివి తీరుతుందేమో...

సువ : పాలకవర్లు, పాత పేపర్లు కొంటారు గానీ...మీలాగా శాపాలిచ్చి, శాపనార్ధాలు పెట్టే పతిదేవుళ్ళనెవరూ కొనరండి...సర్లేండిముందో రూపాయుంటే యివ్వండి... పోనీ రాజయ్యా.... ప్రతిసారీ నువ్వేవతనుగా సామాన్లన్నీ తెద్దూగానీ ప్రతి ఫస్టుకీ వచ్చి కిరాయి తీసుకోరాదు...

రాజ : సామాన్లు అవీ ఎంత వాయిదా పద్ధతుల్లో కొనుక్కున్నా రిక్షా కిరాయి గూడా అట్టా వాయిదాల పద్ధతిలోనే యిస్తానంటే కుదరదమ్మా....

చల : యిదిగో సువర్చలా...సామాన్లు కొనుక్కోవాలంటే ఖర్చులు తగ్గించి ఆదా చేసిన డబ్బుల్తో కొనుక్కోవాలే గానీ, యిస్తున్నారు గదాని ప్రతీ షాపులో పద్దేసి పట్టుకొస్తే తీర్చడం ఎలా ? ఆలోచించు ..అసలే జీతం తక్కువ...జరుగుబాటు చాలా కష్టం అయిపోతుంటే చాలదన్నటు ఈ వాయిదాల బాగోతం ఒకటా....

సువ : సర్లేండి ...యిలా తేలిక వాయిదాల్లో యిస్తున్నారు కాబట్టి కొనుక్కుంటున్నాం గానీ, డబ్బులు పోసి కొనాలంటే మనవల్ల అయ్యే పనేనా ? .... ఏ యింట్లో చూసినా టీవీలు వీసి ఆర్లూనూ.... యిలా చూసిన వాళ్ళు అలా కొనుక్కుంటున్నారు.... మనవూ ఉన్నాం....మీరూ నేను తప్ప మూడో వస్తువే లేదు....

( అంటుండగా చక్రపాణి తల మాత్రం లోపలికి పెట్టి చూసి మాయమయ్యాడు )

చక్ర : ( బయట్నుంచి ) అమ్మా ...తల్లీ ...మాదాకవళం తల్లీ...తిండి తిని మూడ్రోజులయిందమ్మా....ఆకలి మండి పోతుందమ్మా.....

సువ : వెళ్ళు...వెళ్ళు.... చెయ్యి వీల్లేదు.... నే చెప్పానని పక్కింటికెళ్ళు... మీరేవిటి ఆటోచనలో పడ్డారు....

చల : అహ...ఈ గొంతు ఎక్కడో విన్నట్టుగా వుంటేనూ....

సువ : మీతోపాటు చదూకున్న కుర్రాడేమో పాపం... వుద్యోగం దొరక్క వీధిన పడుంటాడు...లోపలికి పిలవనా....

చక్ర : లోపలికెందుకులేమ్మా.... ఒక్కసారి గడపలోకొచ్చి ఒక్క స్కీమ్ వినిపోమ్మా.... పదిపైసలకి  పట్టుచీరమ్మా.... పెద్దాపరేషన్ చేయించుకుంటే ప్రెషర్ కుక్కరమ్మా...

సువ : ఎవండీ వాడు... అడుక్కునేవాడా ...దొంగసామాన్లు అమ్మేవాడా...వుండండి చూసొస్తా...

చల : వొద్దే...వొద్దు...వ్యాపారం చేసి దివాళా తీసినతనయి వుంటాడు..... పోనీ పాపం వాగి వాగి వాడే పోతాడు....

రాజ : అమ్మా వీధిలో రిక్షా వుంది... అది కాస్త పోయిందంటే నా ప్రాణమేపోతుంది...నా డబ్బులు నాకిప్పిస్తే...

సువ : పోతే పోనీ  వెధవ రిక్షా...చక్కగా ఇన్‌స్టాల్‌మెంట్లో ఆటో కొనుక్కుందువుగానీ నేనిప్పిస్తాలే... అవునండీ మర్చిపోయా... యివాళ మీకు జీతాలొచ్చే రోజు కదా....

చల : జీతాలొచ్చేరోజు మాత్రం చక్కగా గుర్తుంటుంది....( అంటూ జేబులోంచి డబ్బు తీసి దాంట్లోంచి ఒక పది కాయితం తీసి ) రేయ్ రాజయ్యా ...నీ పేరేంటి ?

రాజ : రాజయ్యండి.....

చల : యిది తీసికెళ్ళి చిల్లరపట్రా....

రాజ : అలాగేనండి ( వెళ్ళిపోయాడు )

( సువర్చల దృష్టి అతని చేతిలో ఉన్న డబ్బు పైనే వుంది....అతను డబ్బును తిరిగి పదిలంగా జేబులో వుంచుకున్నాడు )

సువ : ఏవిటో ....అప్పుడప్పుడు నాకనిపిస్తూనేవుంటుంది.... మీరు మాత్రం ఏం సుఖపడుతున్నారు అని... ఉదయ్యాన్నే తినీ తినక పరిగెట్టడం, ఏ రాత్రికో రావడం, రాగానే, ఉందీ లేదంటూ చర్చలూ గొడవలూనూ.... ఓ ఆటోమేటిక్ వాచీనా, ఓ సఫారీ సూటా ! స్కూటరా...మీకు మాత్రం కోరికలుండవ్ ? ....ఏవండీ మీకో ఉంగరం  తెచ్చి ప్రజంట్ చేయనా ?

చల : ఏం...బంగారం కూడా ఇన్‌స్టాల్‌మెంట్లో యిచ్చే వెధవెవడైనా తగిలాడా.... సువర్చలా.... నాకు వుంగరాలూ వద్దు బొంగరాలూ వద్దు.... నన్నిట్లా బతకనీ... అర్థమైందా ?

సువ : సరే పోనీండి... వద్దు మొర్రో అంటుంటే నాకెందుకొచ్చింది – నేనే నల్లపూసల

గొలుసు తెచ్చుకుంటా.... ( ఆ మాటకు చలపతి ఉలిక్కిపడి జేబులోని డబ్బు తీసి ఆమె చేతిలోకుక్కి )

చల : ఒసే సువర్చలా...వొద్దు ..నామాట విను... నీకు పుణ్యం వుంటుంది.... ఇదిగో నా జీతం...ప్రతి నెలా యింతే వస్తుంది...దీంట్లో తెచ్చుకుంటున్న వస్తువులకి వాయిదాలే కడతావో ...యిల్లే గడుపుతావో నీ ఇష్టం.... నెల మధ్యలో ఒక్క రూపాయి కావాలన్నా నే తేలేని అసమర్ధుణ్ణీ, అప్రయోజకుణ్ణీ, పనికి మాలిన వాణ్ణి... అంచేత బట్టలూ, బీరువాలు ఈ లెవల్లో ఆగిపోయి తృప్తిపడు... బంగారాలు, భవనాలు, ఎస్టేట్లు యిస్తాం అన్నారు కదాని కొనబోకు ...అల్లరయిపోయి వీధిన పడ్తాం... అర్ధమైందా...

సువ : ( డబ్బు లెక్క పెట్టుకోవడం పూర్తిచేసి ) అర్ధమైందండీ...అర్ధమైంది... యిన్నేళ్ళుగా నాతో అబద్దాలు చెప్పి ఎంత మోసం చేసేరో నాకిప్పుడే అర్ధమైంది.

చల : అబద్దాలా... అబధ్ధాలేమిటి ? మోసం... మోసం ఏవిటి ?

సువ : ఆహా..... ఏం నటనండి... బళ్ళారి రాఘవ గారూ మీ ముందు బలాదూరే....

చల : అబద్దాలూ, మోసం. పైగా నటన..... ఏవిటే నీ వాగుడు..నాకేం అర్ధం కాకుండా వుంది...

సువ : నాకూ అలాగే వుంది... ప్రతి నెలా 1500 మాత్రం నా చేతిలో పెట్టి యింకో 1500 దాస్తున్నారన్నమాట...

చల : పదిహేనొందలు నీకిచ్చి యింకో 1500 దాస్తున్నానా ?...ఎక్కడ ...

సువ : ఏ బాంకులోనో అయ్యుంటుంది... బాగా గుర్తు తెచ్చుకోండి...

చల : అంటే నీవుద్దేశ్యం నా బుర్ర పాడయిపోయిందనేగా.... యిదిగో చూడూ...నా జీతం 1500 అంతే...

సువ : యిప్పుడిది.... మీ నెలజీతమేగా ?

చల : అవునూ... అయితే ....

సువ : అయితే ఏవిటి ? నా బొంద ....3000 చేతికిచ్చి పైగా 1500 అని దబాయిస్తారేవండీ ?

చల : మూడువేలా ? ....నో... ఇంపాసిబుల్...

( ఆమె చేతిలో డబ్బు లాక్కుని లెక్కపెడుతుండగా రాజయ్య ప్రవేశించాడు )

సువ : నెలకి మూడువేలు జీతమయితే ఎన్ని సామాన్లు కొనుక్కోవచ్చో...ఏరా ?

రాజ : అవునమ్మా ...యిహా ఏదయినా అమ్మే వోడిదే ఆలస్యం.... బాబూ...యీ పది నోటు అయిదుకిచ్చినా ఎవరూ తీసుకునేట్టు లేరండి.... బాగా నలిగిపోయి చిరిగిపోయింది గూడాను....

చల : కొంపమునిగింది...

సువ : ఏవైందండీ....

చల : ఆరామూర్తి లేడూ...

సువ : ఏరామ్మూర్తి ?

చల : అదేనే....మా ఆఫీసులో కాషియర్ .... నా ఫ్రెండ్....

రాజ : రామ్మూర్తిగారంటే పక్క వీధిలో పెంకుటింట్లో వుండే ఆయనేగదండీ....

చల : ఆ ...వాడే...జీతం యిస్తూ పొరపాటున పదిహేనొందలు ఎక్కువిచ్చేసేడు... యాభై కాయితాలనుకుని వంద కాయితాలు యిచ్చేశాడు పాపం.

రాజ : అరెరె పాపం...

సువ : అంతేగదా...ఏవిటో అనుకున్నా....యిందులో అంత కొంపమునిగిపోయే విషయం ఏవుంది ?

చల : కొంపమునిగేది వాడికే....పాపం వుద్యోగం పోయినా పోవచ్చు....

సువ : పోనీండి...దానికి మనవేంచేస్తాం... ( అంటూ చేతిలోని డబ్బు గుంజుకుంది )

రాజ : రామ్మూర్తిగారు శానా మంచోరండి...ముక్కుకి సూటిగా పోయే మనిషండి....

సువ : అంటే రాజయ్యా... రామ్మూర్తి నీకు తెలుసన్నమాట....

రాజ : భలేవోరే...నాకు తెలీకపోడం ఏంటమ్మా.....వాళ్ళమ్మగోర్ని రోజూ ఆసుపత్రికి తీసుకెళ్ళేది నేనేగదమ్మా.....

చల : సువర్చలా....1500 యిలా యివ్వు....తీసుకెళ్ళివాడికిచ్చేసి వస్తా....

సువ : చాల్లే వూరుకోండి...యిదిగో రాజయ్యా...చిల్లర లేదుగానీ రేపొచ్చి నీ డబ్బులు తీసికెళ్ళు.

రాజ : కుదరదమ్మా ...బండికి కిరాయి కట్టాలి....

సువ : అలాగా.... అయితే ఆ పదికాయితం యిలా యిచ్చి గడపలో నిల్చో...నే తెచ్చి యిస్తాగా...

రాజ : కాస్తత్వరగా యివ్వండి...మళ్ళీ రామ్మూర్తిగారింటికెళ్ళే వేళయింది...

సువ : యిప్పుడు చెప్పండి...ఏవిటి మీ హడావుడి ...గొడవాను...

చల : గొడవా కాదు ...హడావుడీ కాదే.... పొరపాటున ఎక్కువిచ్చిన ఆ డబ్బు కాస్తా వాడికిచ్చేస్తే సంతోషిస్తాడే పాపం... వాడూ పిల్లలు గలవాడు....ఉద్యోగమే ఆధారం....

సువ : అలాంటప్పుడు వళ్ళు దగ్గరపెట్టుకుని ఉద్యోగం చేసుకోవాలి...క్యాషియర్‌వి కదాని దానకర్ణుడిలా చేతికెంతొస్తే  అంత యిచ్చేయడవేనా ? ..... మీరేం మాట్లాడకండి.... బుద్దీజ్ఞానం  అనుభవం అన్నీ ఒకేసారొస్తాయి...

చల : అది కాదే మనం పొరపాటున రాజయ్యకి పదిరూపాయలు ఎక్కువిచ్చామనుకో వాడు నిజాయితీగా  తిరిగి యిచ్చేస్తే మనం సంతోషించం.

సువ : నేనైతే సంతోషించను ...వాణ్ణి చూసి జాలిపడతాను... అవునూ ...రాజయ్యంటే గుర్తుకొచ్చింది.... ఆ వెధవంతా విన్నాడు కదా ...సరాసరి  వెళ్ళి మొత్తం చెప్పేస్తాడంటారా ?

చల : తప్పకుండా చెబుతాడు....అసలప్పుడే వెళ్ళిపోయాడేమోనని నా అనుమానం...

సువ : ఆ.... ! ( అని అటూ యిటూ చూసింది...టీ పాయ్ పైనున్న ఫ్లవర్ వాజ్ ఆమె దృష్టి నాకర్షించింది...చటుక్కున దాన్ని చేతిలోకి తీసుకుని కనిపించకుండా దాచేస్తూ ) త్వరగా లోపలికి పిలవండి వాణ్ణి....ఊ ...మిమ్మల్నే...

చల : దేనికీ ఆ ఫ్లవర్‌వాజ్...

సువ : చెప్తాగా... జారిపోకుండా ముందు వాణ్ణి లోపలకు పిలవండి... మిమ్మల్నే ( అంటూ తను వెళ్ళి గుమ్మం పక్కగా పొంచి నిల్చుంది ) చలపతి అర్ధంకాక యిక తప్పదన్నట్టుగా

చల : యిదిగో రాజయ్యా...రాజయ్యా... యిలారా....

రాజ : ( లోపలికివస్తూ ) గంట ఏ మాత్రం  అయ్యిందిబాబూ ....అప్పుడే ఆకలిదంచేస్తుంది (అంటూ లోనికివస్తూ ఓచోట ఆగేడు....వెనక నుండి సువర్చల చేతిలో ఫ్లవర్‌వాజ్‌తో దగ్గరకు వస్తుండగా అది చూసి చలపతి ఏడుపుమొహం పెట్టేడు... )

రాజ : ఏంటి బాబూ మొహం అలా పెట్టేరు.... ఓ అర్థమైంది...ఆ రామ్మూర్తిగారు
( అంటుండగానే సువర్చల వెనుక నుండి ఫ్లవర్ వాజ్‌తో రాజయ్య నెత్తిమీద
కొట్టింది...చలపతి కళ్ళు మూసుకున్నాడు...రాజయ్య స్పృహ తప్పి నేల కూలాడు.

చల : నీ మొహం మండా....నీకేమైనా పిచ్చి పట్టిందా ? వాణ్ణిలా కొట్టి చచ్చావ్ ?

సువ : ఉత్తపుణ్యానికే అరచి హైరానా పడకండి.... మీ అంత పిచ్చివాడ్ని
నేనెక్కడాచూళ్ళేదు... ఏపని చేసినా నేనెంత ఆలోచన చేస్తానో మీకేం తెలసు....
యిప్పుడు వీడు మన కళ్ళముందే వున్నాడు కాబట్టి రామ్మూర్తికి చెబుతాడన్న భయం
లేదు. స్పృహలో లేడు గాబట్టి మనం ఏం మాట్లాడుకున్నా వాడికి
తెలియదు....అన్నట్టు కాఫీ తాగుతారా !....

చల : కాఫీ వద్దు కషాయం వొద్దుగానీ ఆ డబ్బిటియ్యి... తీసికెళ్ళి రామ్మూర్తికిచ్చి
జరిగిందంతా చెప్పి....

సువ : వెరీగుడ్ అనిపించుకొస్తానంటారు అంతేగా ...మీరెక్కడ దొరికారండీ నాకు...
పాపం పుణ్యం అంటూ ప్రతి విషయానికీ జాలిపడి కన్నీళ్ళెట్టేసుకుంటారు...నా మాట
విని జరిగిందంతా మర్చిపోండి....బిడ్డొచ్చిన వేళ అనివూరికే అన్నారా ? ....
కలిసొచ్చే రోజొస్తే అన్నీ యిలాగే జరుగుతాయి...నేవెళ్ళి ఆ డబ్బు కాస్త కట్టి వాషింగ్
మిషన్ తెచ్చుకుంటా....

చల : నీ వాషింగ్ మిషన్ పాడుగానూ...నే చెప్పేది కాస్త వినిపించుకుంటావా....పాపం
పుణ్యం అనేవి చచ్చాక గానీ తేలవే.... కానీ యీ చచ్చినాడు లేవంగానే సరాసరి
ఆ రామ్మూర్తి యింటికెళ్ళి అంతా చెప్పిచస్తాడు.

సువ : అదా యిందాకటి నుంచీ మీరనేది.... వాడి సంగతి నే చూసుకుంటా లెండి....
లేవగానే వంద చేతిలో పెట్టి విన్నదీ చూసిందీ అంతా మర్చిపోరా అంటే ఎగిరి
గంతేసి మర్చిపోడు....

చల : ఎందుకు మర్చిపోడు...మర్చిపోతాడే....ఆ వందా అయిపోగానే అంతా
గుర్తుకొస్తుంది... వచ్చి మళ్ళీ ఎగిరి గంతేస్తానంటాడు....

సువ : అదీ చూద్దాం....అయినా ఏమో మన అదృష్టం బావుండి వాడిపేరుతో సహా అన్ని
విషయాలు మర్చిపోవచ్చు.... చెప్పలేం....

చల : అంటే !

సువ : అర్థం కాలేదా .... ఓ...మీరు సినిమాలు కూడా చూడరు కదూ... మొన్న ఓ

సినిమాలో హీరోకాలు జారిపడిపోయి లేచి దుమ్ము దులుపుకుంటూ పక్కనున్న పెళ్ళాన్ని ఎవరమ్మా మీరు.... మీవారేం చేస్తుంటారు అని అడిగేడు... మెదడుకి గట్టిగా దెబ్బతగిలితే పూర్వజన్మలు గుర్తొస్తాయని సినిమా డాక్టరుగారు చెప్పేరు....

చల : అంటే నీ వుద్దేశం.... వీడు లేవంగానే పలకరిస్తే నా పేరు రాజయ్యకాదండీ..... కనకలింగేశ్వర్రావు మాది చిలకలపూడి...నేను పళ్ళడాక్టర్‌ని అని చెప్తాడా....

సువ : చెప్పొచ్చు ....వాడికి మెదడంటూ వుంటే జరిగే అవకాశం వుంది..... అయినా రిక్షా వాళ్ళకి మెదళ్ళంటూ వుంటాయంటారా !

చల : పెద్దాసుపత్రికి ఫోన్ చేసి కనుక్కుని చెప్తాను... నీ ఆశావాదం తగలెయ్య...సువర్చలా... ఎందుకొచ్చిన తంటాలే యివన్నీ .....హాయిగా నిజాయితీగా బతక్కుండా....

సువ : నిజాయితీ అందరికీ వుండాలండీ ...ఒక్క మీకూ నాకూవుంటే సరిపోదు.... అయినా గీతలో కృష్ణుడేం చెప్పాడు.... చేసేదీ...చేయించేదీ అంతా నేనే అన్నాడు...రామ్మూర్తికి యివాళ డబ్బు పోగొట్టుకునేయోగం వుంది.... పోయింది... మనకి రావలసిన యోగం వుంది... వచ్చింది....అంతా ఘటన ...మనదేముంది...నిమిత్త మాతృలం ....

చల : ఏవన్నా చెప్పవే...రామ్మూర్తి ఎదురుగా వచ్చి నిల్చుంటే వాడి కళ్ళలోకి చూడలేను.... వాడితో మాట్లాడలేను.... ( అంటుండగా బయటినుండి చలపతి...చలపతీ ...అన్న రామ్మూర్తి గొంతు వినిపించి చలపతి కంగారుపడ్డాడు )

చల : అడుగో ....చెప్పానా....రానే వచ్చాడు.... యిప్పుడు నిలేసి అడుగుతాడు...

సువ : మీరు లోపలికి వెళ్ళండి నేను మాట్లాడతాగా... ఊ...త్వరగా...

చల : అది కాదే...వాడికి జరిగిందంతా జరిగినట్లు చెప్పేసి....

సువ : అదీ చూద్దాం....అయినా ఏమో మన అదృష్టం బావుండి వాడిపేరుతో సహా అన్ని విషయాలు మర్చిపోవచ్చు.... చెప్పలేం....

చల : అంటే !

సువ : అర్ధం కాలేదా .... ఓ...మీరు సినిమాలు కూడా చూడరు కదూ... మొన్న

సువ : మీరేం మాట్లాడకండి.... పదండి ( అంటూ బలవంతాన లోపలికి నెట్టేసింది...వెంటనే రామ్మూర్తి ప్రవేశించాడు )

రామ్మూ : ఏమ్మా ...వీడింకా రాలేదా...యివాళ త్వరగానే బయలుదేరాడే ఆఫీసునించి...

సువ : రండన్నయ్యగారూ ...అలా కుర్చోండి...ఆయన కెన్ని పనులూ ...ఎన్ని వ్యవహారాలూ...ఏ వేళకొచ్చినా వండి వార్చడానికి నేనున్నానుగా.... అవునూ...అమ్మగారెలా వున్నారు....

రామ్మూ : ఆవిడ పరిస్థితేం బాగోలేదమ్మా....వీడున్నాడేమో  ఓ విషయం అడిగి...

సవ : అన్నయ్యగారూ యివ్వాళ వాయిదాల పద్దతిలో బీరువా పట్టుకొచ్చాం అన్నయ్యగారూ... 1500 పది వాయిదాలు...కలరూ అదీ ఎంత బాగుందనుకున్నారూ....

రామ్మూ : అలాగా సంతోషం ...ఉద్యోగంలో చేరిన దగ్గర్నుంచి బీరువాకొనాలని ప్రయత్నం ...కుదిరి చస్తేనా... ఎప్పటికప్పుడూ రోగాలూ....డాక్టర్లూ...మందులు ( అని ఏదో చెప్పబోయేడు )

సువ : మీరేం బాధపడకండి...ఆ షాపు వాడితో చెప్పి మీక్కూడా యిప్పిస్తాగా ...ఎంతలో కావాలి ? ( చక్రపాణి తలలోపలికి పెట్టి చూసి చలపతి లేకపోవడంతో లోనికి ప్రవేశించాడు )

చక్రి : ఎంతలో కావాంలటే అంతలో వున్నాయమ్మా....వెయ్యి రూపాయల్నించి నాలుగువేలదాకా....

సువ : అలాగా.... యింతకీ మీరెవరూ....

చక్రి : నాపేరు చక్రపాణమ్మా.... ఫీల్డు ఆఫీసర్ని.... డెవలప్ మెంటాఫీసర్ని...చక చకా అయ్యగారు... రాకముందే రెండు స్కీములు చెప్పి వెళ్ళిపోతానమ్మా....పే టెన్ టేక్ వన్ అని ఎ బి సి డి ఎలక్ట్రానిక్స్ షాపు మొదలుపెట్టేరమ్మా...

సువ : అంటే వాళ్ళ షాపులో మిక్సీలు.... వాషింగ్ మిషన్లూ వుంటాయా....

చక్ర : కలర్ టీ.వి, కుట్టుమిషన్‌లు, వాటర్ కూలర్సు....

చల : ( ప్రవేశిస్తూ ) ...నీ మొహం మండ.... మళ్ళీ తగలడ్డావా.... వొరేయ్...నీ కాళ్ళు పుచ్చుకుంటా.... వేరే కొంప చూసుకోరా.... నన్నెందుకురా యిలా ఫ్రై చేసుకు తింటున్నావ్....

సువ : వాడి కాళ్ళు మీరు పుచ్చుకోవడం ఏమిటండీ....ఎవరితను....

చక్ర : అమ్మా...నేను....నేను

చల : వొద్దు...వెళ్ళిపో ( బయటకు నెట్టేసి ) హమ్మయ్య ...వ్యాపారం చేసి దెబ్బ తిని పిచ్చి వాడయిపోయాడన్నానే ....వీడే...అవునూ...

రామ్మూ : ఏవిట్రా...నువ్వింటోనే వున్నావా ? ...ఏమ్మా ...యింకా ఆఫీసునుంచి రాలేదన్నావ్ ...?

సువ : మీరెప్పుడొచ్చారు.... నే చూళ్ళేదే.... దొడ్డివాకిలిని ప్రవేశించారా....

చల : మరేనే ...పార్వతమ్మ గారి పెరట్లో నుండి గోడ దూకి వచ్చా....

సువ : చూశారా అన్నయ్యగారూ...పరువు గల వాళ్ళం ...పట్ట పగలు గోడలు అవీ దూకితే ఏం బాగుంటుంది చెప్పండి.....

చల : చీకటి పడ్డాక దూకాలిగానీ....వెళ్ళి వాడికీ నాకూ కాస్త కాఫీ పట్రా వెళ్ళు ( అంటూ కసిరేడు )

రామ్మూ : అవున్రా ...రాజయ్యగాడేంటి యిలా పడిపోయేడు పాపం...

చల : అదా....అదీ ....అదే ఏమే మాట్లాడవే...రాజయ్య యిలా ఎందుకు పడిపోయాడని అడుగుతున్నాడు రామ్మూర్తి.... ఏమే చెప్పి చచ్చావా !....

సువ : యింకేం చెప్పిచావలా...ఏదో ఒకటి మీరు చెప్పి చావొచ్చుగా ...వస్తువులు అమర్చడం నేనే....వాటి ఇన్‌స్టాల్‌మెంట్లు కట్టడమూ...నేనే...అయినా నా పిచ్చిగానీ ఏనాడు ఏ పనిలో నాకు సాయం చేసారుగానీ....

రామ్మూ : పోన్లేమ్మా.... బాధపడక...అయినా ఏదో సోషొచ్చి పడిపోయుంటాడు అంతేగా....

ఇద్దరూ : అంతే....అంతే....

సువ : పాపం వున్నట్టుండి ఎంత జాలి పుట్టుకొచ్చిందండీ వాడి మీద ...అన్నయ్యగారూ నిజం చెబుతున్నాను కదా....ఈయనకి రిక్షా వాళ్ళన్నా.... పని వాళ్ళన్నా అస్సలు జాలి లేదనుకోండి.... వాళ్ళతో గీచి గీచి బేరాలాడతారు.... నాకయితే వాళ్ళని చూస్తుంటే కడుపు తరుక్కుపోతుంది....అయినా ఏ వస్తువు కావాలన్నా ఇన్‌స్టాల్‌మెంటులో యిచ్చే వెధవలు చాలా మందున్నారు...అయినా వాటిని జాగ్రత్తగా నిజాయితీగా యింటికి చేర్చే రిక్షావాడుండొద్దూ .... ఏ మాట కామాటే చెప్పుకోవాలి.... రాజయ్య రోజూ వచ్చి అమ్మగారు యివాళ ఏ షాపుకి రమ్మంటారూ అంటూ ఎంతో ఆప్యాయంగా అడుగుతాడో.....

రామ్మూ : అవునమ్మా...రాజయ్యా చాలా మంచివాడు... డబ్బులిచ్చినా యివ్వకపోయినా
ప్రతి రోజూ వేళకొచ్చి మా అమ్మని ఆసుపత్రికి తీసికెళతాడు.... ఏవిటో ...అన్నట్టు
చలపతీ నిన్నో విషయం అడగాలని వచ్చాన్రా.

చల : ఏవిటే చోద్యం చూస్తున్నావ్ చోద్యం ....కాఫీ తెమ్మని చెప్పానా ?

సువ : ఆ చెప్పేరు గుర్తుంది.... వాణ్ణి జాగ్రత్తగా చూసుకుంటూ వుండండి...
( సువర్చల లోనికి వెళ్ళిపోయింది )

రామ్మూ : ఏవిటోరా చలపతీ.... ఎవర్ని నమ్మాలో ఎవర్ని నమ్మకూడదో అయిన వాడెవడో
కాని వాడెవడో అర్ధం కావడంలేదు.... యివాళకివాళ ఆఫీసులో ఏం జరిగిందో
తెలుసా.... ( సరిగ్గా అదే సమయానికి రాజయ్య మూలుగుతూ లేచి
కూర్చున్నాడు....వాణ్ణి చూడగానే రామ్మూర్తి )

రామ్మూ : రాజయ్యా లేచావా....అమ్మకి ఆలస్యం అయిపోతుందని యిదయ్యి పోతుందనుకో
...చలపతీ కాస్త కాఫీ వాడిక్కూడా యిమ్మను పాపం...

చల : సేయ్ నీ మొహం మండ..... వీడు లేచి చచ్చాడే....
( రాజయ్య లేచి )

రాజ : ఎవరూ రామ్మూర్తిగారా..... మీ ఇంటికే వద్దామని బయలుదేరాబాబూ.... అంతలో
యిక్కడేమయిందంటే ( అంతలో సువరల్చల లోపలి నుండి పరుగున వచ్చి
లేవబోతున్న రాజయ్య నెత్తిన ఫ్లవర్ వాజ్‌తో కొట్టింది....
రాజయ్య మళ్ళీపడి పోయేడు )

రామ్మూ : అయ్యయ్యో..అదేవిటమ్మా... వాణ్ణలా కొట్టావ్..అసలే వాడిని వంట్లో బాగోలేదంటే
ఏరా చలపతి మాట్లాడవేరా !

చల : నిజమే....ఏమే... రామ్మూర్తికి మొత్తం చెప్పేస్తానే...

రామ్మూ : ఏవిటది ?....

సువ : అదే అన్నయ్యగారూ ...వాళ్ళతో ఏదో మోటువైద్యం తగలడిందంట...కళ్ళు తిరిగితే
నెత్తిన గట్టిగా కొడితే చస్తే కళ్ళు తిరగవట... ఈ సంగతి చెప్పి కొట్టండీ .....
కొట్టండీ అంటూ కాళ్ళా వేళ్ళా పడ్డాడనుకోండి....

రామ్మూ : అలాగా... వీడి మొహం యిడ్చా...దిక్కుమాలిన వైద్యం వీడూనూ... ఎక్కడా
వినలేదే....ఏరా...

చల : అదే... అవునవునూ... నాకూ అంతా ఆశ్చర్యంగానూ అయోమయంగాను వుందనుకో... ఏమే కాఫీ అన్నావ్.... ఆ కాస్తా యిస్తే వీణ్ణి తీసుకుని బయటికెళతా...

సువ : ఆ పనిలో వుంటేనేగా గావు కేకపెట్టి పిల్చేరు... అయినా ఆ మాత్రం వాణ్ణి చూసుకోలేరూ... ఆడపనికీ మగపనికీ నేనే చావాలి కదా....

చల : చావాలే..చచ్చినట్టు చావాలి....ఎవరికోసంట...యిదంతా నీవల్ల కాదు.... హాయిగా దర్జాగా తిరగాల్సిన వాణ్ణి....

సువ : అబ్బో దర్జా .... మీ దర్జా గురించి నాకు చెప్పకండి.... అదిగో ఆయనకి చెప్పండి... అన్నయ్యగారూ.... పెళ్ళయ్యాక మొదటి పండక్కి మా యింటికొచ్చి ఈయన పాపిష్టి లుంగీ ఒకటి కట్టి దొడ్లో పచార్లు చేస్తుంటే మా కాకినాడ పిన్ని ఈయన్ని చూసి ఎవడేవాడు....కవతగాడా అని అడిగింది.... నా తల కొట్టేసినట్టయిందనుకోండి...దర్జా గురించి మాట్లాడుతున్నారా ....దర్జా.....

చల : ఓసి నీ ఇల్లు బంగారం గానూ ...అవన్నీ యిప్పుడెందుకే....

రామ్మూ : అమ్మాయ్ ...పోనీ ...ఆవేశపడకు సర్దుకుపోతూ వుండాలి....చలపతీ నువ్వు కూడా కాస్త కంట్రోల్‌గా వుండాలి రా...

చల : ఏం కంట్రోల్ ...నా బొందం కంట్రోల్...నరాలు తెగిపోతుంటే.... మొన్న కుక్కరు..నిన్న బట్టలు.... యివాళ బీరువా...యిలా యిస్తున్నారు కదాని ప్రతి రోజూ ఏదో సామాను పట్టుకొస్తుంటే తీర్చడం ఎలా ...అసలే నా జీతం సంగతి నీకు తెలుసు కదా.....

రామ్మూ : జీతం అంటే గుర్తొచ్చిందీ....అదే చెలపతి యివాళ....

చల : ( అతని మాట వినిపించుకోవడం యిష్టంలేనట్టుగా పెళ్ళాంతో ) యివాళంటే గుర్తొచ్చిందీ యిహ నుంచీ నాకు తెలియకుండా నా పర్మిషన్ లేకుండా ఎంత చిన్న వస్తువైనా తెచ్చావో యిహ సరే ఏం చేస్తానో నాకు తెలియదు.... అసలే నాకు కోపం రాదు... వచ్చిందో అహ నిన్నేంచేయను.... అడ్డమైన సామాన్లు యిస్తున్న ఆ షాపుల ముందు పూలదండ మెడలో వేసుకుని సత్యాగ్రహం చెయ్యకపోతే నాపేరు కాఫీ పట్రా త్వరగా....

సువ : అయ్యో రామా ... నా పేరు కాఫీ పట్రా త్వరగా ఏవిటి ?.... రోజూ అన్నయ్యగారి దగ్గరకన్నా వెళ్ళండి... వాక్య నిర్మాణం వ్యాకరణం ఇన్‌స్టాల్‌మెంట్స్ లోనన్నా

చెబుతారేమో....  ఆ వెధవని చూసుకుంటూ వుండండి....యిప్పుడే తెస్తా....

రామ్మూ : పడిపోయేవాణ్ణి యింకా చూసుకునేదేవిటి ? అమ్మాయ్ కాఫీ వొద్దు గీఫీ ఒద్దు ...నువ్వెళ్ళి నీ పనిచూసుకో.... నేను వీడితో ఓ మాట మాట్లాడిపోతా... ( రామ్మూర్తి మాట పూర్తి కాకుండా నే రాజయ్య  లేచి కూర్చున్నాడు ) సరిగ్గా సమయానికి వాడూ లేచాడు.. రిక్షాలో యింటి వరకు పోవచ్చు ( సువర్చల వెంటనే ఫ్లవర్‌వాజ్ తీసుకుంది....అది చూసి  రాజయ్య వెంటనే మళ్ళీ పడిపోయాడు....చలపతి పరుగున వెళ్ళి వాణ్ణి పరీక్ష చేసి )

చల : మళ్ళీ స్పృహ పోయింది....

రామ్మూ : ఏరా చలపతీ...నాకేం అర్థం కావడంలేదు... అంతా అయోమయంగా వుంది... అసలేవిట్రా యిదంతా...లేచినప్పుడల్లా వాణ్ణి తలదిమ్మెకేట్టు కొట్టడమేవిటి ? నేను నోరు  తెరిస్తే మీరు పోటాడుకోవడం ఏవిటి ?....బయట గడపలో ఆ కానిస్టేబుల్ ఏవిటి ?...

చల : ఆ.... కా..కా...కానిస్టేబుల్...గుమ్మంలో పోలీసా...నువ్వు పట్టుకొచ్చావా....  సేవ్... నీ మొహం మండా... విన్నావా...నే మొదటే చెప్పానా....

సువ : అదేం కాదులెండి.... పోలీసే అన్నయ్యగార్ని  పట్టుకొచ్చి వుంటాడు....

రామ్మూ : పోలీసుని  నేపట్టుకురావడం ఏవిటి ?.... నన్ను పోలీసు పట్టుకురావడం ఏవిటి ? ... అసలు మీరేం మాట్లాడుతున్నారో మీకేవన్నా తెలుస్తుందా !....

చల : తెలుస్తుంది రామ్మూర్తి...తెలుస్తుంది యిప్పుడిప్పుడే ...తెల్లారిలేస్తే వీధిలోనూ ఆఫీసులోనూ  మొహాలు చూసుకోవాలే.... కనీసం  ఆ మొహమాటం కూడా లేకుండా యింత తొందరపడతావా ? .....

సువ : మీరుండండీ...అన్నయ్యగారూ ....ఆయన మాటలకేంగాని మా బీరువా చూద్దురుగానీ రండి....

రామ్మూ : తరువాత చూద్దాంలేమ్మా....ఏవిటన్నావురా... నే తొందరపడ్డానా... ఏం తొందరపడ్డానో  చెప్పరా.... నిన్నేం పల్లెత్తుమాటన్నానా....నీకేవన్నా  వీసమెత్తు అపకారం చేసానా.... చెప్పరా...చెప్పు....

చల : చెప్తా రామ్మూర్తి ...మొత్తం చెప్పేస్తా....యిదిగో  దీని మాటవిని యిలా అయిపోయానురా..... అసలేం జరిగిందంటే...( అంటుండగా సువర్చల సూత్రాలు

కళ్ళ కద్దుకొని ఫ్లవర్‌వాజ్‌తో చలపతి నెత్తి మీద కొట్టింది.....చలపతి బాధగా కుర్చీలో కూలబడిపోయేడు )

రామ్మూ : అయ్యయ్యో...అదేవిటమ్మా....మొగుణ్ణి అలా కొడతావా ?

సువ : నాకు యిలాగే వచ్చుండీ ...యిందాకణ్ణించి కళ్ళు తిరుగుతున్నాయని ఒకటే గొడవ... పైత్యం వాగుడూనూ.... రండి బీరువా చూద్దురుగానీ...

రామ్మూ : తరువాత చూస్తాలేగాని ...నాకంతా ఏంటోగా వుందమ్మా....

సువ : పైత్యం వల్లే అయ్యుంటుంది...కళ్ళు తిరుగుతున్నాయికదూ....

రామ్మూ : నాకా....అబ్బే...అదేం లేదు... పదమ్మా...బీరువా చూద్దాం...ఓ పని అయిపోతుంది....( సువర్చలా, రామ్మూర్తి లోపలికెళ్ళంగానే చలపతి లేచి కూర్చొని తలనిమురుకుంటా )

చల : దీని మొహం మండా.... ఎంత పట్టు పట్టింది...రాజయ్య ఎలా భరించేడో పాపం... ( అంటుండగానే సువరల్చ బయటికొచ్చింది )

సువ : లేచారా... యిప్పుడు చెప్పండి... గుమ్మంలో ఆ పోలీసుని రామ్మూర్తే వెంటబెట్టుకొచ్చారంటారా....

చల : వాడేడీ ...బీరువా చూస్తున్నాడా.... కాస్త మెల్లిగా మాట్లాడు...వినగలడు...అబ్బా...

సువ : ఆ మాత్రం నాకూ తెలుసండి...గదిలోపలి కెళ్ళగానే తలుపు గడియపెట్టి వచ్చా....

చల : ఓసి నీ అఘాయిత్యం పాడుగానూ ....వాడేవన్నా అనుకోడటే...సువర్చలా... ఎందుకొచ్చిన తంటాలే యివన్నీ ...ఆ పాపిష్టి డబ్బు కోసం యిన్ని కుట్రలు , కుతంత్రాలు, అబద్దాలూనూ....

సువ : నీతి శతకం తరువాత పారాయణం చేసుకుందాం...ముందు ఆ పోలీసు ఎవరికోసం వచ్చాడో ఏమో తేల్చండి....అసలే నాకు పోలీసులంటే భయం...

చల : యింకా అనుమానమా ....రామ్మూర్తే వెంటబెట్టుకొచ్చి వీధిలో వుండమని వీడిలా లోపలికి వచ్చేడు...మనంతట మనం బయటపడి చెబుతామేమోనని ఎదురుచూస్తున్నాడన్న మాట...

సువ : అంటే చెప్పకపోతే వాణ్ణి లోపలికి పిలిచి...

చల : నీకూ నాకూ పోలీస్ సన్మానం చేయిస్తాడు...కేసులూ, కోర్టులూ, గొడవాను.... ఛీ..ఛీ..

యిప్పుడేవిటి చేయడం...

సువ : ఆడవాళ్ళు అరెస్టయితే అసహ్యంగా వుంటుంది... పోనీ మనసురాయి చేసుకొని ఆ డబ్బు కాస్తా యిచ్చేద్దామనుకుంటే...రాగానే యివ్వకుండా యిప్పుడిచ్చావనుకుంటారేమో...

చల : యిప్పుడు డబ్బు కాదే ముఖ్యం ...పరువు .... ఆ ...ఐడియా... వెళ్ళి ఆ డబ్బు పట్రా త్వరగా....

సువ : యిదిగో యిక్కడేవుంది....

చల : అరచి చావకు ....యిప్పుడు రామ్మూర్తి నిజం చెప్పినా పరువుపోవడం ఖాయం... అంచేత తాత్కాలికంగా ఆ డబ్బు వీడిజేబులో పెట్టామనుకో యిహ మనకేం సంబంధం లేదు.... వాడి జేబులోకి ఆ డబ్బెలా వచ్చిందో మనకు తెలియదు....

సువ : మరి వీడు లేచి నాకేం తెలియదని లబోదిబోమంటే....

చల : ఆ భయం నీకేం అక్కర్లేదు....

సువ : అమ్మయ్య...నాకూ ఓ ఐడియా ...గదిలో రామ్మూర్తి...గడపలో పోలీసు వెళ్ళేదాక అసలీ వెధవని లేవనీయకుండా చూసామనుకోండి...ఆ డబ్బు మళ్ళీ మనమే సొంతం చేసుకోవచ్చు... ఏవంటారు....

చల : యింకా బుద్ధిరాలేదా... త్వరగా వెళ్ళి ఆ రామ్మూర్తిని పంపించు ...యిహ నువ్వేం మాట్లాడకు .... నాకు ధైర్యం వచ్చింది.... వాడి కళ్ళల్లోకి సూటిగా చూసి గడగడా మాట్లాడగలను...

సువ : సరే.... అలాగే రేపు మారేజ్ డేకి పట్టుచీర మీరు తెస్తారా.... నన్ను తెచ్చుకోమంటారా...

చల : నే తెస్తానే ..ఒట్టు...తొందరపడక...లేకపోతే మారేజ్ డే నాడే విడాకులిచ్చి పడేయ్... తెలిసుంటుంది.... నిన్నీవిధంగా మెయిన్‌టైన్ చెయ్యడం కన్నా మనోవర్తికట్టడమే తేలిక...( సువర్చల వెళ్ళింది...అంతలో రాజయ్య బాధగా మూలిగి కదిలేడు.... చలపతి ఆత్రంగా వాణ్ణి సమీపించి పరీక్షగా చూస్తున్నాడు.... సరిగ్గా అప్పుడే పోలీసు ఆంజనేయులు ప్రవేశించాడు... పడిపోయివున్న రాజయ్యని, పక్కన

చలపతిని చూసి అనుమానంగా చలపతి పక్కన నిలబడి చూస్తుండగా చలపతి రాజయ్యని మరోసారి కొట్టడం తప్పదని రూఢీ చేసుకుని ఫ్లవర్‌వాజ్ కోసం వెళ్ళబోయి ఆంజనేయులు చేతిలోని లాఠీని మాత్రం చూసి దాన్ని అతని చేతిలోనికి తీసుకుని రాజయ్య నెత్తిన కొట్టి రాజయ్య తిరిగి స్పృహ కోల్పోగా తృప్తిగా తలాడించి కర్రని తిరిగి ఆంజనేయులికిస్తూ )

చల : షాకింగ్‌గా...

ఆంజ : ( అనుమానంగా టోపీతీసి ) నో మెన్షన్ ( అంటూ తిరిగి టోపీ పెట్టుకున్నాడు )

చల : సారీ సర్..... మీరూ ...మీరూ....

ఆంజ : పోలీసు ఫోర్స్‌తో హెడ్ ఫోర్స్‌ని...పేరేమో ఆంజనేయులు...అంతా ఆనండాఫ్ ఆంజనేయులు అంటారు.... ఏవిటీ అర్థమైందా....

చల : ఆంజనేయులు వరకు అర్థమైంది సార్.... ఆ తరువాతంతా అపార్థాలే....

ఆంజ : బాధపడకు ...పోలీసోడంటేనే పెద్ద అపార్థం.... వాణ్ణి పెళ్ళాంకూడా నమ్మదు...నీకు బాగా అర్థమయ్యేలా ....ఏ కీలు కాకీలు విప్పి మరీ చెప్తా.... ( టోపీ తీసి ) యిప్పుడు నేను డ్యూటీలో లేనన్నమాట...నీలాగా ...వీడిలాగా ...అందరిలాగా ఓ కామన్ మేన్‌ని ...ఏంటి కష్టం సుఖం, మంచి చెడూ మాటాడుకోవాలంటే యిదన్నమాట టైం....ఏంటి ?

చల : ఎరేంజ్ మెంట్ బావుంది సార్....

ఆంజ : పూర్తిగావిను .... ( టోపీ పెట్టుకొని ) యిప్పుడు ఆన్ డ్యూటీ అన్నమాట...అంటే హెడ్ ఆంజనేయులు .... ఫోర్స్ మొత్తం మనకి సెల్యూట్ కొట్టాల్సిందే ...ఏలెత్తి చూపడానికి వీల్లేదు.... యామ స్ట్రిక్ట్...

చల : ( సెల్యూట్ చేసి ) అరటి పండు వలచి చేతిలో పెట్టినట్టు....

ఆంజ : అర్థమైంది కదా...వెరీగుడ్ ( టోపీతీసి ) ఆ.... ఏం లేదు... నా పద్ధతే అంత.... మర్డర్ కేస్ కెళ్ళినా ప్రొసీజర్ చెప్పి ప్రొసీడ్ అవుతానన్నమాట....పబ్లిక్‌ని ఎడ్యుకేట్ చెయ్యాలి కదా.... ( టోపీపెట్టుకుని ) కాసేపు డ్యూటీ చేస్తా...

చల : అబ్బే యిక్కడ మీరు చెయ్యదగ్గ డ్యూటీ ఏం లేద్సార్....

ఆంజ : షటప్... నోటాకింగ్ ....చెయ్యాలేగానీ పోలీసోడికి ప్రతి చోటా డ్యూటీ

వుంటుంది.... పడగ్గది దగ్గర నుంచి పార్లమెంటు దాకా ....ఏంటి ?

చల : అర్థమైంది గానీండి... యిది పడగ్గదీ కాదు... పార్లమెంటూ కాదు.... మా డ్రాయింగ్ రూం...

ఆంజ : డ్రాయింగ్ రూమో...హిష్టరీ రూమో గానీ ఈడెవడూ....రాయబారం సీన్లో ఎ.వి.సుబ్బారావ్‌లా తొంగున్నాడు....

చల : వాడూ ..రిక్షా వాడండి...

ఆంజ : అమ్మనాకొడుకు .....వీడన్నమాట .... రిక్షాని రోడ్డుకడ్డంగా పార్కింగ్ చేసేసి యిక్కడ కునుకేస్తున్నాడా ....యీనా కొడుక్కోసం నేను గడపలో గంటనుండి డ్యూటీ చేస్తూ నుంచుండిపోయా....

చల : వీడికోసమా ..అంటే తవరు రామ్మూర్తితో పాటు రాలేదా...

ఆంజ : రామ్మూర్తా....ఎవడా తొత్తు కొడుకు...

చల : సారీ చెప్తా గానీ ఓ సారి డ్యూటీ దిగుతారా ..నా కోసం ...ప్లీజ్...

ఆంజ : దిగమంటే దిగడానికీ ...ఎక్కమంటే... ఎక్కడానికీ యిదేవన్నా సిటీ బస్సనుకున్నావా ! జనరల్‌గా ఛస్తే దిగను... కానీ మొదటి సారిగాబట్టి దిగుతున్నాను.... ( టోపీ తీసి ) మళ్ళీ మళ్ళీ దిగను.... చెప్పుకునేదేంటో తొందరగా చెప్పేసుకో....

చల : అహ ఏం లేద్సార్...మీరు ఆన్‌లో వున్నప్పుడు... ఐ మీన్ డ్యూటీలో వున్నప్పుడు భాషకాస్త ఇబ్బందికరంగా వుంది సార్... రిక్షా వాడికీ.... రామ్మూర్తికీ ఒకే బూతు వాడుతుంటేనూ.....

ఆంజ : అదా నీ డౌటు ..పోలీసోడికి ప్రజలంతా ఒకటే.... కామన్ లాఠీ... కామన్ బూతు... యింతకీ యీ విషయం అడగడానికా దిగు దిగని తొందరపెట్టేపింది ( టోపీ పట్టుకుని ) రైటూ...యింతకీ యీ తొత్తు కొడుకు ఎందుకిలా పడకేశాడు.... ( అతడేదో చెప్పబోతుడంగా రామ్మూర్తి, సువర్చలా వెనక నుంచి వచ్చేరు )

సువ : యింతకీ బీరువా ఎలా వుందన్నయ్యగారూ...

రామ్మూ : బీరువా అందంగా వుందిగానీ నువ్వు చేసిన పని మాత్రం అసహ్యంగా వుందమ్మా... లోనికి వెళ్ళనిచ్చి తలుపు కాస్తా బయటనుంచి గడియ పెడతావా....యిదేమైనా మర్యాదగా వుందిరా....

సువ : అదా...చీర మరీ అసహ్యంగా వుంటేనూ...మార్చుకుందామనిపించి...

చల : అవునూ చీర మార్చుకున్నట్టు లేదే... చీర మార్చుకుందామని తలుపేసి మనసు మార్చుకొని వుంటుంది.... ఏవే అంతేగా....

సువ : అంతే.,..అంతే అన్నయ్యగారూ....

ఆంజ : ఆగండి... పోలీసోణ్ణి పక్కనెట్టేసి మీలో మీరే కులాసాగా కబుర్లాడేసుకుంటున్నారే... నాకాట్టే టైం లేదు... పాయింట్‌లోకి రండి... ఆ రిక్షావాణ్ణి నా లాఠీతో నా ముందే ఠపీమంటూ కొట్టావ్ ...రీజనేంటి ?....

సువ : ఏవిటీ.... నేనటెళ్ళంగానే మళ్ళీ లేచి చచ్చాడా.... అయ్యో పోలీసన్నయ్యగారూ ...నిలబడే వున్నారా...అలా కుర్చోండి....

ఆంజ : కూర్చోను...రూలొప్పుకోదు... ఆన్‌లో వున్నాను....

సువ : ( కొంగుతో ముక్కు మూసుకుంటూ ) ...అదా సంగతి చూడంగానే అనుకున్నాను...పైగా ఒకటే వాసన ...కాసిని మజ్జిగ గానీ యిమ్మంటారా....

ఆంజ : ఎవరూ ...మీ ఆడోళ్ళేనా ...ఆన్‌లో వున్నానంటే అదనుకుంటున్నట్టుంది...అది కాదూ... యిదీ అని ఎడ్యుకేట్ చెయ్....

చల : అలాగే సార్.... తరువాత తాపీగా చెప్తా... మీలాంటి వాళ్ళగురించి కట్టె కొట్టె తెచ్చె అంటూ తేల్చేస్తే ఏం బావుంటుంది...

రామ్మూ : సరే....నే వెళ్ళొస్తారా చలపతీ....

సువ : అలాగే అన్నయ్యగారూ...

ఆంజ : ఆగు... అంతా దాటించేస్తున్నట్టు డౌట్‌గా వుంది... ఆ రిక్షా నాకొడుకు పడిపోవడం ఏవిటి ! ఆణ్ణి నువ్వు నా లాఠీతో కొట్టడం ఏవిటి... వీడు మెల్లిగా జారుకోవడం ఏవిటి ! అంతా పెద్ద రాకెట్‌లా వుంది... విషయం తేలేవరకు ఎవరూ గడపదాటడానికి వీల్లేదు... యిది ఆంజనేయులు ఆర్డర్స్ ...యిప్పుడు చెప్పు వాణ్ణి కొట్టడానికి కారణం...

చల : అదాండీ... అదీ...అసలేవయిందంటేండి...

సువ : నే చెప్తా.. మీరుండండి....ఈ వెదవ మావారి రిస్టువాచీ కొట్టేశాడండి....

చల : నీమొహం మండ ( అంటూ ఆంజనేయులు చూడకుండా చేతికున్న వాచీ తీసి జేబులో వేసుకున్నాడు )...

ఆంజ : ఐ సీ... నిజంగానేనా...

రామ్మూ : ఏరా నీ చేతి గడియారం పోయిందా ? ...ఎప్పుడు....

సువ : యిందాకే,... మీరొచ్చే ముందే అన్నయ్యగారూ... ఆఫీసునుండి యీ వెధవ యిటు... బీరువా మోసుకుని ఆయనటు... ఛ..ఛ...ఆఫీసునుంచి ఆయనటు...

ఆంజ : ఆగండి... అంతా అయోమయంగా వుంది.... ఆ పడిపోయింది రిక్షా వాడేనా...ఈయన నీ మొగుడేనా ?

చల : అవునండి.... నిజంగా ..నిజవండి...

రామ్మూ : చలపతీ.... యిందాకొచ్చినప్పుడు నీ చేతికి వాచీ చూసినట్టు గుర్తే...

సువ : అన్నయ్యగారూ...మీరిందాక కళ్ళు తిరుగుతున్నాయన్నారు.... కాసేపు రెస్టు తీసుకోరాదూ...

ఆంజ : నే యింటరాగేషన్ చేస్తున్నప్పుడు ఎవరూ నోరెత్తడానికి వీల్లేదు... అడిగిన వాళ్ళని అడిగినంతవరకు చెప్పండి... మీ యింట్లో పోయిన వాచీని వీడే తీసాడని గారెంటీ ఏవిటీ ?...నువ్వు చెప్పు....

సువ : అన్నయ్యగారూ ...అసలేంజరిగిందంటే...యివాళ మేము... ఇన్‌స్టాల్‌మెంట్ మీద యినబ్బీరువా కొనుకున్నావండి... సరే రాజయ్య తెలిసినవాడే కదాని రిక్షాలో తెమ్మంటే తెచ్చినట్టే తెచ్చి టేబిల్ మీదున్న గడియారం కాస్తామాయం చేసాడండి...

ఆంజ: ఐ సీ... వాడు తీస్తుండగా మీరెవరైనా చూశారా ?

సువ : ఏవండీ...చూశామా ?...

చల : చూస్తే ఆంజనేయులుగారి అవసరమేముంటుంది ?

రామ్మూ : అది కాదురా...అనుమానం వచ్చినప్పుడు వాణ్ణి లేపి అడగొచ్చు కదా....

ఆంజ : ఇదంతా పోలీసు బిజినెస్.... వాచీని వీడే తీసుంటాడని ఐడియా ఎప్పుడొచ్చింది...

సువ : మీరు అడిగిన వెంటనే ...అంటే నా వుద్దేశ్యం....

చల : యింట్లోకి వీడు తప్ప యింకెవరూ రాలేదండి.... అంచేత ఖచ్చితంగా యిది వీడి పనే అయ్యుంటుందని యిదిగో వీడు పారిపోకుండా యిలా కాపలా కాస్తున్నాం...

ఆంజ : ఐ సీ... అమ్మనాకొడకా .... పని పూర్తి చేసుకుని ఎంత పీస్ ఫుల్‌గా నిద్రోతున్నాడో....

రామ్మూ : అవున్రా ...వాడి జేబులో వెతికారా.... ?

ఆంజ : ఆ పని పోలీసోడే చెయ్యాలి...దొంగపని దొంగ చెయ్యాలి...పోలీసోడి పని పోలీసే చెయ్యాలి.... ఎవరి డ్యూటీని వాడు చెయ్యాలి.... అప్పుడే లా అండ్ ఆర్డర్ నిలబడుతుంది.

సువ : పోన్లేండి అన్నయ్యగారూ ...పోతే పోయింది వెధవ్వాచీ.... అనవసరంగా హైరానా పడకండి... కాసిని మంచి నీళ్ళు గానీ... మజ్జిగ్గానీ ఇమ్మంటారా ?

ఆంజ : ( టోపీ తీసి ) రెండూ చెరో గ్లాసూ యివ్వమ్మా ...కాస్త షుగరు కూడా తగిలించు ....( టోపీ పెట్టి ) సరే వాచీ మిస్సింగన్న ఓరల్ కంప్లైంట్ ఆధారంగా బాధ్యతగల పోలీస్ కానిస్టే....పోలీస్ ఆఫీసర్‌గా వీడి జేబుల్ని మీ ముందే సెర్చి చేస్తా....

చల : కానీ వుంటుందన్న నమ్మకం నాకయితే లేదు.... ఈపాటికే దాన్ని బయటకు దాటించేసి వుంటాడు.... అయినా పోతే పోయింది లెండి.... డ్యూటీ దిగి కాసేపు రిలాక్సయి వెళ్ళండి...

ఆంజ : నో రిలాక్సింగ్ బిజినెస్... వాచీగానీ.... గోచీగానీ పోగొట్టుకునేవరకే మీ డ్యూటీ...మీరు మర్చిపోయినా మేము మర్చిపోమూ.... పోలీసోడితో లెక్క లెక్కే.... అర్ధమైందా ?...సెర్చింగ్ చెయ్యాల్సిందే ....వాచీ ట్రేస్ కాకపోతే వీడంతు తేల్చాల్సిందే.... ( అంటూ ఆంజనేయులు రాజయ్య దగ్గరకు వెళుతుండగా )

చల : రామ్మూర్తీ ..యివాళ నీ డబ్బులు కూడా పోయాయి కదా....

రామ్మూ : నా డబ్బులా....

ఆంజ : డబ్బులు పోయాయా....ఎంత...వీడేతీసాడా....

సువ : వాడిపనే అయ్యుంటుంది... రోజూ వాళ్ళింటికి కూడా వెళుతుంటాడు....

రామ్మూ : చూడమ్మా......వాడంటే మతి చెడినవాడిలాగా ఏదేదో వాగుతున్నాడు... యిప్పుడు నువ్వు కూడానా ?....

ఆంజ : ఎంత పోయిందో ...ఎప్పుడు పోయిందో త్వరగా చెప్పండి..... ఈ లోపు ఓ మినిట్ డ్యూటీ దిగి రిలాక్సవుతా.....( అంటూ సువర్చల తీసుకొచ్చిన గ్లాసు అందుకుని తాగుతున్నాడు )....

చల : నీవి యివాళ 1500 పోయినవి.... ఆ సంగతి చెప్పడానికొచ్చావ్ అంతేగా ...ఏం మాట్లాడకు... యిదికూడా రాజయ్యగాడి పనే అయ్యుంటుంది.... యిప్పుడు

ఆంజనేయులుగారు డ్యూటీ ఎక్కి వాడి జేబులు సెర్చి చేస్తారు... నిజంగా ఆ డబ్బు వాడే తీస్తే అక్కడే వుంటుంది....

రామ్మా : నన్ను కాస్త మాట్లాడనిస్తారా....

సువ : మీరేం మాట్లాడకండి... పోయిన డబ్బు తిరిగి రావడం మనక్కావలసింది.... ఎలా పోయిందీ ఎలావచ్చిందీ...మధ్యలో ఏం జరిగిందీ అంతా మనకనవసరం...అన్నయ్యగారూ ఆ జేబులు వెదికే కార్యక్రమం త్వరగా పూర్తి చేస్తారా.....

ఆంజ : అలాగే చెల్లమ్మా ... ( టోపీ పెట్టుకుని ) రైటూ .... ఎవరూ ఏం మాట్లాడకండి... సెర్చింగ్ చేసే ముందు చిన్నమాట... మీవాచీ...వారి డబ్బు పోయాయి...ఆ రెండింటికీ వీడే కారణమని మీ అనుమానం ...అంతేగా....

చల : అంతేనండి....

సువ : అతేనండి....

రామ్మా : కానీ హెడ్‌గారూ ...ఓ మాట....

ఆంజ : యింకే మీవద్దు... డిటైల్స్ తరువాత డిస్కస్ చేద్దాం.... ముందు సెర్చింగ్ చెయ్యాలి.... ( ఆంజనేయులు వెళ్ళి రాజయ్య జేబులు వెతుకుతున్నాడు )

రామ్మా : రేయ్...చలపతీ... నీ వరస నాకేం అర్థం కావడంలేదురా....

చల : ఓ క్షణం ఓపిక పట్టు ...తరువాత తీరుబడిగా మాట్లాడుకుందాం....

సువ : అన్నయ్యగారూ ....మీరేం బాధపడకండి.... నెల జీతం అంటే మాటలా.... కష్టార్జితం ఎక్కడికీపోదు.... అక్కడే వుంటుంది ( ఆంజనేయులు రాజయ్య జేబులోని డబ్బు తన జేబులోకి మార్చుకున్నాడు కొంతసేపు వెతికినట్టు నటించి గంభీరంగా లేచి రెండు పచార్లు చేస్తూ )

ఆంజ : యూ ఆర్ కరెక్ట్...చూడ్డానికి అలా వున్నాడే కానీ పెద్ద కిలాడీ తొత్తు కొడుకులా వున్నాడు... దొంగ సొమ్ముని ఆల్రెడీ అవతలకి దాటించేసేడు....

చల : అంటే ....

ఆంజ : అంటే వాడి జేబులో మీ వాచీ గానీ ...వారి కేష్ గానీ ఏమీ లేవు...

చల : ఆ .....

సువ : మరేమున్నాయ్....

చల : ఏవున్నా ఏవిటి..... వాడి జేబులో డబ్బు....కేషే లేదంటే....

సువ : ఆ.... ( ఆత్రంగా వెళ్ళి రాజయ్య జేబులు తను వెదికి ).... అవును నిజంగా లేవు....
రామ్మూ : ఎలా వుంటాయమ్మ...  అసలు డబ్బులు పోతేగా....
ఆంజ : ఆ....  ఏటన్నారూ.... అసలు డబ్బులు  పోలేదా.... ( జేబులు తడుముకుని )
అంతా అయోమయంగా వుంది.... అంటే యీ తొత్తు కొడుకు యింకెక్కడో  చెయ్యి చేసుకున్నాడన్నమాట....
చల : చెయ్యి చేసుకోవడమా !
ఆంజ : యిదంతా పోలీసు బిజినెస్ ...అంతా మర్చిపోండి .....  యింతకీ డబ్బు పోకపోయినా పోయిందని  పాల్స్ కంప్లైంట్  యిచ్చారు అవునా !
సువ : నిజంగా పోయాయండి ..ఎవరు తీసారో గానీ వాళ్ళ చేతులు పడిపోను... వాళ్ళ బి.పి.రైజ్ గానూ.... షుగర్ కోమాలో పడిపోనూ....ఎ.సి.బి వాళ్ళకి దొరికిపోనూ....
ఆంజ : ( కంగారుగా టోపీ తీసి ) ఆగమ్మా.... అక్కడితో ఆపెయ్ ...నాకు దడగా వుంది.... అసలు కేసంతా కన్ఫ్యూజింగ్‌గా వుంది.... మీరే మో డబ్బు పోయిందంటున్నారు... ఆయనేమో పోలేదంటున్నాడు.... వీడి జేబులో  కాష్...వాచీ కాదుకదా.... కనీసం బీడీ ముక్క గూడా లేదు.... అంతా అయోమయంగా వుంది....
రామ్మూ : యిందులో అమోమయం ఏమీ లేదండి.... వీడి వాచీ పోయిందో లేదో తెలియదు గానీ నాదని చెప్పబడుతున్న 1500 కాదు కదా.... పదిహేను పైసలు కూడా పోలేదు.... నే చెప్పేది...  నిజం.... రేయ్ చలపతీ యింకాసేపిక్కడే వుంటే నా మనసూ మైండూ పూర్తిగా  పాడయ్యేట్టున్నాయి....  నే వెళ్తున్నా వెళ్తున్నా హెడ్‌గారూ... నే చెప్పింది రాసిమ్మన్నా రాసిస్తా....కానీ వెళ్ళే ముందొకమాట ... రాజయ్య చాలా మంచివాడు...నిజాయితీగల వాడు...ఎక్కడో పొరపాటు జరిగి వుంటుంది....  వస్తా ( అని వెళ్ళి పోయాడు )
ఆంజ : ఈడూ పాపం.... నిజాయితీగల తొత్తు కొడుకు వల్లే అనిపిస్తుంది.... యింతకీ పోయిన డబ్బు  వాడిదేనా ?
సువ : నిజంగా వాడిదేనండీ... పోయిన మాట కూడా నిజం....కానీ ఎందుకు అబద్ధం ఆడుతున్నాడో  అర్థం కాకుండా వుంది ?
ఆంజ : వదిలేయ్యండి...వాడి గొడవ మర్చిపోండి....  సొమ్ములు పోయాయి మహాప్రభో అంటూగోలెట్టే వాళ్ళకే హెల్ప్ చేయడానికి  టైం చాలడం లేదు... సరే....కమింగ్

టు దపాయింట్. నాకాట్టే టైం లేదు.... ఈ తొత్తు కొడుకు స్పృహలోకొచ్చే దాకా వెయిటింగ్ చేస్తే బయట లా అండ్ ఆర్డర్ చెయ్యిదాటి పోతుంది... అంచేత నే వెళతా... వాడు లేవగానే స్టేషన్‌కి తోలుకొచ్చే పూచీ నీది.... ఏంటి...అర్థమైందా !..

చల : అయిందేదో అయిపోయింది...ఆ వాచీ కేసు కూడా క్లోజ్ చేసెయ్యండి....

ఆంజ : ఏంటి...వాచీ కేసు క్లోజ్ చెయ్యాలా ...కుదరదు.... కేస్ వన్స్ బుక్డ్ విల్ నాట్ బి క్లోజ్డ్ ఎట్ ఆల్...ఏంటి అర్థమైందా.... వాడు మిస్సయ్యాడో ...నువ్వు ట్రబుల్స్‌లో పడిపోగలవు...

సువ : యిదెక్కడి గొడవండీ ...నిమ్మకాయ నీళ్ళు తాగి కూడా యింత నిర్మొహమాటంగా మాట్లాడతారా ?

చల : పోయింది మా వాచీ ఏగా.... మర్చిపోండి.... మీకు పుణ్యముంటుంది....

ఆంజ : కుదరదు.... అసలీ రోజుల్లో దొంగతనం చెయ్యడం చిన్న తప్పు.... కానీ మా డిపార్ట్‌మెంటుతో కోపరేట్ చెయ్యకపోవడం పెద్ద తప్పు... ఏంటి అర్థమైందా... రైటూ... మరి స్టేషన్‌లో ( సువర్చల సౌంజ్ఞని అర్థం చేసుకుని వెళ్ళిపోతున్న ఆంజనేయుల్ని ఆపేరు చలపతి... )

చల : మీరాగండి.... ఒక్క క్షణం ఆగండి మాకోసం...ప్లీజ్...

ఆంజ : త్వరగా చెప్పు... ఏంటి సంగతి....

చల : అహ ఏం లేదు.... ఒక్కసారి డ్యూటీదిగండి.... ఒక్కసారీ....

ఆంజ : దిగను.... నేను డ్యూటీ దిగడం అంటే నీకు చీపుగా అనిపిస్తుందా... యిందాక మట్టుకు యిందాక దిగు దిగని మొహమాట పెట్టి తీరా దిగాక లాఠీలను గురించి బూతుల గురించి మాట్లాడతావా ! ఉహు నే దిగనుగాక దిగను....

సువ : ఈ ఒక్కసారికి నాకోసం .... నా మొహం చూసి దిగండి.... కాదనకండన్నయ్య గారూ...

ఆంజ : ( టోపీ తీస్తూ ) నీ మాట కాదనలేక దిగానమ్మా.... మీకూ నాకూ అందరికీ ఉపయోగపడే మంచి మాట చెప్పుకోండి...త్వరగా ...నే వెళ్ళాలి...

చల : ఏమే.... ఆ డబ్బుల్లోంచి.... ఓ వందియ్యి...

సువ : ఏ డబ్బులూ ... మొత్తం మీకేయిచ్చాగా....

చల : ఆ ....మొత్తమా...అంటే మూడు వేలా...పూర్తిగా....

ఆంజ : మూడు వేలేంటి... యింకోకేసా....

సువ : ఎంత పనయిపోయిందండీ ..అంత వెనకాముందూ చూసుకోకుండా మొత్తం వాడి జేబులో ఎందుకు పెట్టారండీ...

ఆంజ : ఎవరి జేబులో ...ఎంటి కదా... మీ సొంత గొడవలైతే తరువాత మాట్లాడుకోండి... నాకెందుకొచ్చింది... డ్యూటీ దిగి స్టాండింగయిపోయున్నా....

చల : అయ్యా హెడ్డు గారూ... అయిపోయింది... అంతా అయిపోయింది... ఏమనుకుని ఏం లాభం... డ్యూటీ ఎక్కి సరాసరి వెళ్ళిపోండి....

ఆంజ : ఏంటి....డ్యూటీ ఎక్కి వెళ్ళిపోవాలా...నేను వెళ్ళేవాణ్ణి వెనక్కి పిలిచి బతిమాలి డ్యూటీ దింపి తీరా దిగాక ఎక్కేసి వెళ్ళిపొమ్మంటావా ...అలాగే వెళ్తా... యిందాక ఆనాకొడుకుని లాఠీతో నాముందే కొట్టావ్ గుర్తుందా...దొంగైనా ... మర్డర్ చేసి వొళ్ళయినా పబ్లిక్ మట్టుకోవడానికి వీల్లేదు... ఆణ్ణి కొట్టినా... చంపినా పోలీసోళ్ళే చెయ్యాలి... అంచేత నీ మీద ఆ కేసు బుక్కయ్యింది....

చల : నామీదకే...

ఆంజ : అదే చెప్పేది... ఆణ్ణి చేత్తో పుచ్చుకుని స్టేషన్కొస్తే.... డ్యూటీ ఎక్కడాలు... దిగడాలు.. హాస్యాలు.... ఆటలు అక్కడాడుకుందాం... అర్ధమైంది పదా... నే వస్తాను రైటూ... ( ఆంజనేయులు వెళ్ళిపోయేడు )

సువ : ఆయన అన్నంతపనీ చేస్తాడంటారా ?

చల : చేస్తాడే... ఎందుకు చెయ్యడు... అయినా యిదంతా నీ వల్ల కాదు... మొదట్లో రామ్మూర్తితో యీ విషయం అంతా చెప్పి ఆ డబ్బు కాస్తా యిచ్చేసుంటే ఎంత హాయిగా గౌరవంగా వుండేది... సొమ్ముకి సొమ్మూ పోయింది. స్నేహితుడికి ద్రోహం చేశానన్న బాధా మిగిలింది...

( రామ్మూర్తి మళ్ళీ వచ్చేడు )

రామ్మూ : నువ్వు నాకేం ద్రోహం చెయ్యలేదురా చలపతీ....

చల : రామ్మూర్తీ....నువ్వింకా యిక్కడే వున్నావా ?

సువ : అన్నయ్యగారూ...మీరింకా వెళ్ళలేదా ....

రామ్మూ : లేదమ్మా...నా కెందుకొచ్చిందని దులుపుకుపోదామనకున్నా వీడి పరిస్థితి చూసి
కాళ్ళాడక గడపలోనే ఆగిపోయా....

చల : రామ్మూర్తి...నీకు నిజంగానే ద్రోహం చేసానురా.... జీతం యిస్తూ నువ్వు పొరపాటున 1500 ఎక్కువయిస్తే ఆ సంగతి తెలిసి ఈ రాక్షసి దురాశకి పోయి నా చేత యిన్ని దురాగతాలు, దుర్మార్గాలు చేయించింది.

రామ్మూ : నేను....నీకు ...డబ్బులెక్కువిచ్చానా !...

సువ : అవునన్నయ్యగారూ ....1500లకు బదులుగా 3000 యిచ్చారట... ఆ సంగతి చెప్పి పాపం ఈయన మీ ఇంటికొచ్చి డబ్బులు యిచ్చేస్తానంటే నేనే అడ్డుపడి ఆపేసాను...

రామ్మూ : చలపతీ... బాధపడకు...జరిగిందేదో జరిగిపోయింది..... మా అమ్మ ఆపరేషన్‌కి డబ్బులు సహాయం చేస్తావేమోనని అడుగుదామని వచ్చి మీలో అనవసరమైన భయాన్ని  కలిగించాను... నన్ను కూడా మీరూ క్షమించాలి....

చల : మేము నిన్ను క్షమించడమా ...అంటే...

రామ్మూ : ఏం లేదు... నువ్వనుకుంటున్నట్టుగా నేను మీకు డబ్బేం ఎక్కువయివ్వలేదు... పది రోజుల క్రితం  నువ్వు ప్రావిడెంటు ఫండ్ లోన్ అప్లయ్ చేశావ్ గుర్తుందా !....

చల : అవును....గుర్తుంది...అయితే...

రామ్మూ : యివాళ జీతం తీసుకునేటప్పుడు ఎన్నిచోట్ల సంతకం పెట్టావో గుర్తుందా....

చల : అంటే....

రామ్మూ : జీతం యిచ్చే సమయానికి లోను శాంక్షనయి వస్తే రెండూ కలిపి మూడు వేలిచ్చాను.... అంతే...

సువ : అంటే...ఆ పోయిన మూడువేలూ....

రామ్మూ : మీ డబ్బేనమ్మా....

చల&సువ : ఆ.....

( చలపతి, సువర్చల ఫ్రీజ్ అయిపోయేరు.... రామ్మూర్తి అయోమయంగా చూస్తుండగా...రాజయ్య లేచి పెద్దగా పగలబడి నవ్వుతుండగా )